క్లుప్తంగా

కరాటే క్రీడాకారుడికి చేయూత



బాలుడికి రూ.5 వేల చెక్కు అందిస్తున్న శ్రీరామచంద్రమూర్తి

భీమునిపట్నం: కరాటేలో ప్రతిభ చూపిన బాలుడికి స్థానిక స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ బుధవారం ఆర్థిక సాయం అందించింది. నేరెళ్లవలస కాలనీకి చెందిన కోలా అభిషేక్ కరాటేలో జిల్లా, రాష్ట్రస్థాయిల్లో పలు పతకాలను సాధించాడు. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడానికి ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి రూ.5 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు.

12 మద్యం సీసాల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

తగరపువలస: చిట్టివలసలో అనధికారంగా మద్యం విక్రయిస్తున్న బైరెడ్ల రాంబాబు అనే వ్యక్తి నుంచి భీమిలికి చెందిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు బుధవారం 12 క్వార్టర్ మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు దాడి చేసి పట్టుకుని, నిందితుడిపై కేసు నమోదు చేశారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు

తగరపువలస: ఆనందపురం మండలం వేములవలస సర్వే నంబర్ 147లోని ప్రభుత్వ స్థలాల్లో కొంతకాలంగా అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. భీమిలి క్రాస్ రోడ్డు సమీపంలో జాతీయ రహదారిని ఆనుకుని కోట్ల విలువ చేసే ఈ ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు జరుగుతున్నా.. రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై విచారణ జరిపించి ప్రభుత్వ ఆస్తులు రక్షించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

తాటితూరులో విద్యుత్ సమస్య

తగరపువలస: భీమిలి మండలం తాటితూరు పంచాయతీలో లో ఓల్టేజీ కారణంగా గృహోపకరణాలు పనిచేయం లేదని స్థానికులు వాపోతున్నారు. ముఖ్యంగా ఏసీలు, ఫ్రిడ్జ్‌లు, ఫ్యాన్‌లు పనిచేయక మండే ఎండలకు తాళలేకపోతున్నామని అంటున్నారు. ఇళ్లలో లైట్లు కూడా సరిగ్గా వెలగడం లేదని చెబుతున్నారు. చిట్టివలస రూరల్ విద్యుత్ సబ్‌స్టేషన్ అధికారులు లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని పంచాయతీ ప్రజలు కోరుతున్నారు.

ఫుట్‌పాత్ ఇలా... నడిచేదెలా?



ఫుట్‌పాత్‌పై వేసిన ఇసుక

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డులో నిర్మాణ సామగ్రిని ఎక్కడ పడితే అక్కడే నిల్వ చేస్తున్నారు. ప్రధాన రహదారులు, ఫుట్‌పాత్‌లపై రాయి, ఇసుక, ఇటుక ఉంచడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రుషికొండ ప్రధాన రహదారి, ఎండాడ, సాగర్‌నగర్, భువనేశ్వర్ కాలనీ ప్రాంతాల్లో ఈ సమస్య అధికంగా ఉంది. నిర్మాణాలు చేపడుతున్న యజమానులు ఇష్టానుసారంగా స్థలాలను ఆక్రమించి రోడ్లు, ఫుట్‌పాత్‌లపై నిర్మాణ సామగ్రిని ఉంచుతున్నారని, వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



మరమ్మతులు చేసి.. రంగులు వేసిన పైలాన్



భీమిలి బీచ్ వద్ద ఆధునికీకరించిన అల్లూరి పార్కు

ఆకర్షణీయంగా అల్లూరి పార్కు

- పైలాన్, ఫౌంటెన్ల ఆధునికీకరణ
- రూ.12 లక్షలతో పనులు
- సందర్శకుల హర్షం



ఫౌంటెన్ల చుట్టూ ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్స్

భీమునిపట్నం: అల్లూరి పార్కు ఆకర్షణీయంగా రూపుదిద్దుకుంది. భీమిలి బీచ్‌కు ప్రవేశ మార్గంలో ఉన్న పైలాన్, అల్లూరి పార్కు, ఫౌంటెన్లను అధికారులు ఆధునీకరించడంతో చూడచక్కగా రూపొందాయి. గతంలో ఎవరూ సరిగ్గా పట్టించుకోకపోవడంతో పైలాన్ పెచ్చులు ఊడిపోయి, కొన్ని చోట్ల దెబ్బతిని ఉండేది. అలాగే అల్లూరి పార్కులో అల్లూరి సీతారామరాజు విగ్రహంతో పాటు ఇతర విగ్రహాలు పాడైపోయాయి, వాటి దగ్గరలో ఉండే ఫౌంటెన్ పరిస్థితీ దయనీయంగా ఉండేది. గత ప్రభుత్వానికి ముందే వీటి ఏర్పాటు జరగగా తరువాత వీటి సంరక్షణ గురించి అధికారంలోకి వచ్చిన గత ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు.

దీంతో ఇవి బాగా దెబ్బతిన్నాయి. ఇదిలా ఉండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బీచ్, పార్కులపై దృష్టి సారించి పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా వీటి కోసం ప్రభుత్వం రూ.12 లక్షలు కేటాయించింది. దీంతో ఇటీవల పైలాన్‌కు అవసరమైన మరమ్మతులు చేసి, చక్కని రంగులు వేశారు. దానికి ఆనుకుని ఉన్న ఫౌంటెన్‌ను కూడా బాగు చేసి రంగులు వేయడంతో పాటు ఫౌంటెయిన్లు ఏర్పాటు చేసి, వాటికి లైటింగ్ ఏర్పాటు చేశారు. అదేకాకుండా దానికి రక్షణగా చుట్టూ ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేశారు.

సమీపంలోని అల్లూరి పార్కులో విగ్రహాలను బాగు చేయడంతో పాటు వాటికి రంగులు వేసి పార్కు పరిసరాలను శుభ్రం చేశారు. ఎవరూ లోపలికి రాకుండా తగిన చర్యలు తీసుకోవడంతో అవి అందంగా, ఆకర్షణీయంగా తయారయ్యాయి. దీంతో సందర్శకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బీచ్‌కు వచ్చే వారు వీటి వద్ద ఆగి, కొద్ది సేపు ఉండి ఫొటోలు తీసుకుని అప్పుడు బీచ్‌కు వెళుతున్నారు. ప్రభుత్వం పార్కుల అభివృద్ధికి తీసుకున్న చర్యలను అభినందిస్తున్నారు.

2న 'దర్శిని' చిత్ర బృందానికి అభినందన

మద్దిలపాలెం : వికాస్, శాంతి హీరో, హీరోయిన్లుగా డాక్టర్ ప్రదీప్ దర్శకత్వంలో రూపొందించిన దర్శిని చిత్ర బృందాన్ని జూన్ 2న విశాఖలో అభినందించనున్నట్లు వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ప్రతినిధి నరవ ప్రకాశరావు తెలిపారు. రెండు వారాల క్రితం 100కి పైగా థియేటర్లలో విడుదలై ప్రేక్షకుల ఆదరణ పొందుతుందన్నారు. వి–4 క్రియేషన్స్ పతాకంపై ఎల్.వి. సూర్యం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ చిత్రంలో నటించిన హీరోతో పాటు ఇతర నటీనటులు, అన్ని విభాగాల సాంకేతిక నిపుణులు విశాఖకు చెందిన వారేనని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ, రంగసాయి నాటక సంఘం వ్యవస్థాపకులు బాదంగీర్ సాయి సంయుక్తంగా స్థానిక పౌర గ్రంథాలయంలో చిత్ర బృందాన్ని అభినందించనున్నట్లు తెలిపారు. ఈ అభినందన సభలో మేకింగ్ దర్శిని మూవీ పేరిట ఉచితంగా చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్టార్ మేకర్ లంక సత్యానంద్, నగర ప్రముఖులు హాజరు కానున్నారన్నారు. సినీప్రియులు, ఔత్సాహిక దర్శకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

జూన్ 4న ర్యాలీలు నిషేధం



సమావేశంలో పాల్గొన్న రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు



సమావేశంలో మాట్లాడుతున్న జోన్-1 డీసీపీ లక్ష్మీనారాయణ

జోన్–1 డీసీపీ లక్ష్మీనారాయణ

పద్మనాభం: కౌంటింగ్ జరిగే జూన్ 4న రాజకీయ పార్టీలు ర్యాలీలు చేయకూడదని జోన్–1డీసీపీ లక్ష్మీనారాయణ తెలిపారు. ఎన్నికల కోడ్‌పై రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలతో మండల కాంప్లెక్స్ ప్రాంగణంలో బుధవారం రాత్రి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బాణసంచా కూడా కాల్చకూడదని చెప్పారు. ఎన్నికల కోడ్‌లో పెట్టిన కేసులు జీవితాంతం ఉంటాయని స్పష్టం చేశారు. కౌంటింగ్ రోజున ప్రశాంత వాతావరణం నెలకొనేలా ప్రజలు సహకరించాలన్నారు. నార్త్ ఏసీపీ సునీల్ మాట్లాడుతూ మూడో తేదీ నుంచి తమ పోలీసులు గ్రామాల్లో తిరుగుతుంటారని, ఎటువంటి అల్లర్లు జరిగినా సెల్ ఫోన్లలో ఫొటోలు తీసి రికార్డు చేస్తారని తెలిపారు. వీటిని సాక్ష్యాధారాలుగా చేసుకుని కేసు నమోదు చేస్తామన్నారు. ఇటువంటి వాటికి ఎవరూ ఫిర్యాదు చెయ్యక్కర్లేదని తెలిపారు. కవ్వింపు చర్యలు చేపట్టకూడదన్నారు.

582 మంది బైండోవర్

సీఐ సీహెచ్ శ్రీధర్ మాటాడుతూ ఎన్నికల సందర్భంగా మండలంలో 582 మందిపై బైండోవర్ కేసులు పెట్టామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సురేష్, ఎంపీపీ కె.రాంబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కె.లక్ష్మణరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె.దామోదరరావు, టీడీపీ నాయకుడు కె.నగేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి తదితరులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం బయో కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'ట్రెండ్స్ ఇన్ ఎమర్జింగ్ నానో బయో టెక్నాలజీ–కరెంట్ అప్లికేషన్స్ అండ్ ఫ్యూచర్ ప్రాస్పెక్టస్' సదస్సు పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. జూలై 15వ తేదీన ఏయూ టీఎల్ఎన్ సభా మందిరంలో ఈ జాతీయ సదస్సు నిర్వహిస్తారు. పోస్టర్ ఆవిష్కరణలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, అకడమిక్ అఫైర్స్ డీన్ ఆచార్య ఎన్.ఎ న్.కిషోర్‌బాబు, సదస్సు కన్వీనర్ ఆచార్య పి.రాధిక తదితరులు పాల్గొన్నారు.

మలయాళ నవల 'ఆడు జీవితం'పై ప్రసంగం



ప్రసంగిస్తున్న రచయిత కె.జి.వేణు

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్‌లోని ప్రిజమ్ కళాశాలలో కేరళ సాహిత్యంపై జరిగిన సాహితీ కార్యక్రమంలో మలయాళ రచయిత, కేరళ సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బెన్యామిన్ రచించిన ఉత్తమ మళయాల నవల 'ఆడు జీవితం'పై రచయిత, డాక్టర్ కె.జి.వేణు ప్రసంగించారు. సౌదీ అరేబియాలో వలస వచ్చిన కార్మికులను ఎలా బానిసలుగా మారుస్తారో చెప్పే నవలగా పేర్కొన్నారు. కేరళలోని ఒక గ్రామంలో బోటు నడుపుకుని జీవించే నజీబ్ అనే వ్యక్తి వ్యాపారం బాగాలేదని గల్ఫ్ దేశాలకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకోవాలని అనుకుంటాడన్నారు. ఒక ఏజెంట్ ద్వారా సౌదీ అరేబియాకు చేరుకున్న నజీబ్ అక్కడ పడిన కష్టాలను, దుర్భర బానిస జీవితాన్ని నవలాకారుడు హృదయానికి హత్తుకునేలా రాశారన్నారు. బలమైన కథనం, కథతో నవల చాలా బిగింపుగా సాగిపోతుందని వివరించారు. ఉత్తమ నవలగా 'ఆడు జీవితం' చరిత్రలో నిలిచిపోతుందన్నారు.

స్కిజోఫ్రెనియాపై అవగాహన పెంపొందించాలి



మాట్లాడుతున్న డాక్టర్ సత్యవరప్రసాద్

కొమ్మాది: ప్రజల్లో స్కిజోఫ్రెనియాపై అవగాహన పెంపొందించాలని డాక్టర్ సత్యవరప్రసాద్ అన్నారు. రుషికొండలోని గాయత్రి విద్యా పరిషత్‌లో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. స్కిజోఫ్రెనియా మానసిక వ్యాధితో బాధపడుతున్న వ్యక్తులకు తరుచుగా వినికిడి, మతిస్థిమితం సమస్యతోపాటు ప్రవర్తనలో మార్పులు వస్తాయన్నారు. వీటిని ముందుగా గుర్తించి డాక్టర్‌ను సంప్రదిస్తే వ్యాధిని నివారించవచ్చని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సత్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖన పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

మురళీనగర్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మురళీనగర్ బాలభాను విద్యాలయం ప్రాంగణంలో మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో జూన్ 2న విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు 'ప్రపంచ పర్యావరణం–పరిరక్షణ' అనే అంశంపై పోటీ జరుగుతుందన్నారు. 3–5 తరగతులు, 6–8 తరగతులను ప్రత్యేక విభాగాలుగా ఏర్పాటు చేసి పోటీలు నిర్వహిస్తామన్నారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు అందిస్తామని చెప్పారు. విద్యార్థులకు డ్రాయింగ్ షీట్స్ ఇస్తామని, క్రేయాన్స్, కలర్స్‌లు వారే తెచ్చుకోవాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు 94926 41242, 91210 07683 నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

ఇంటర్ పరీక్షలకు 39 మంది గైర్హాజరు

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్. కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం జరిగిన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 39 మంది గైర్హాజరయ్యారని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ కృష్ణారావు తెలిపారు. ఉదయం జరిగిన ప్రథమ సంవత్సరం ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలకు 357 మంది హాజరు కావాల్సి ఉండగా 340 మంది హాజరయ్యారని, 17 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. వీరిలో ఫిజిక్స్ పరీక్షకు 9 మంది, ఎకనామిక్స్‌కు 8 మంది హాజరు కాలేదని ఆయన తెలిపారు. కాగా మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సం పరీక్షకు 495 మంది హాజరు కావాల్సి ఉండగా 473 మంది హాజరు కాగా 22 మంది హాజరు కాలేదన్నారు. వీరిలో ఫిజిక్స్‌కు 11 మంది, ఎకనమిక్స్‌కు 11 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

వెంకన్న ఆలయంలో విశేషంగా హోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానానికి చెందిన కొండదిగువ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం హోమాన్ని విశేషంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని హోమగుండం వద్ద చక్రపెరుమాళ్లను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, ,పుణ్యాహవచనం, మండపారాధన, అగ్నిప్రతిష్ట, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి సతీ సమేతంగా హోమంలో పాల్గొన్నారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకులు శ్రావణ్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

హనుమాన్ జయంతికి ఏర్పాట్లు



పంచముఖ ఆంజనేయ స్వామి

మధురవాడ: చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయం క్షేత్ర పాలకుడు పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ ధర్మకర్త పిల్లా చంద్రశేఖర్, అధ్యక్ష, కార్యదర్శులు పిల్లా సూరిబాబు, నాగోతి తాతారావు తెలిపారు. శనివారం భక్తుల దర్శనాలు, పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ఉదయం 7 గంటలకు నిత్య అర్చనలు, 7.30 గంటలకు పంచామృత, సుగంధ, జలాభిషేకాలు, 8.30 గంటలకు పంచముఖునికి చెర్రీ పళ్లతో ప్రత్యేక అలంకరణ, 10 గంటలకు సింధూర, తమలార్చన, పుష్పార్చన మొదలగు పూజలు జరుగుతాయన్నారు. హనుమాన్ చాలీసా పారాయణం ఉంటుందని, భక్తులంతా ఆయా కార్యక్రమాల్లో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ ప్యాకెట్లు అందిస్తున్న నిర్వాహకులు

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు శివశక్తినగర్ రోడ్డులో శ్రీకనక దుర్గ క్యాటరింగ్ అండ్ సప్లైయర్స్ నిర్వాహకులు కొర్రాయి బ్రదర్స్ ఆధ్వర్యంలో బుధవారం మజ్జిగ పంపిణీ చేశారు. వారి తండ్రి కొర్రాయి అప్పారావు 31వ వర్ధంతిని పురస్కరించుకుని పాదచారులు, వాహనదారులకు మజ్జిగ ప్యాకెట్లు పంచిపెట్టారు. తాము 12 ఏళ్లుగా చలివేంద్రాలు, ఇతర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు కొర్రాయి మంగరాజు, కొర్రాయి అప్పలస్వామి, సురేష్ తెలిపారు. కార్యక్రమంలో నమ్మి అప్పలస్వామి, నమ్మి శ్రీను, సూరి అప్పారావు, మొల్లి లక్ష్మణరావు, ఈగల రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

మధురవాడ: ఏపీ ట్రాన్స్‌కో మధురవాడ విద్యుత్ సబ్ స్టేషన్ వుడా కాలనీ, జీఎస్ఎన్‌యూఆర్‌ఎం, మధురవాడ 11కేవీ ఫీడర్ పరిధిలో నిర్వహణ, మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు మధురవాడ సబ్‌స్టేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఆపరేషన్స్) ఎస్‌వీఎస్ రామ్మూర్తి తెలిపారు. ఈ కారణంగా పోర్టు కాలనీ, ఎన్‌జీజీవోస్ లే అవుట్, వాంబే కాలనీ, వైఎస్సార్ కాలనీ, గాయత్రి విద్య హాస్పిటల్, కార్పెంటర్స్ కాలనీ, వికలాంగుల కాలనీ, మధురవాడ మెయిన్ రోడ్డు, ఎంఎస్ఆర్ లే అవుట్, సాయి ప్రియా లే అవుట్, చంద్రంపాలెం, భాస్కర నగర్, సంపత్ నగర్ తదితర ప్రాంతాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు.

వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

పౌర సరఫరా గిడ్డంగుల వద్ద హమాలీల ఆందోళన



గంభీరం పౌర సరఫరా గిడ్డంగుల వద్ద ఆందోళన చేస్తున్న హమాలీలు

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం పౌర సరఫరా గిడ్డంగుల వద్ద హమాలీలు బుధవారం ఆందోళన చేపట్టారు. ఇక్కడ 105 రేషన్ డిపోలకు చెందిన సరకులను 16 మంది హమాలీలు లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తుంటారు. ఇటీవల గంభీరం గిడ్డంగుల పరిధిలోని కొన్ని డిపోలకు చెందిన సరకులను పద్మనాభం, పెందుర్తి–1, మర్రిపాలెం–1 గిడ్డంగులకు బదిలీ చేసి, మర్రిపాలెం పరిధిలోని గిడ్డంగుల నుంచి 25 డిపోల సరకులను గంభీరం గిడ్డంగులకు మార్చుతూ అధికారులు జీవో జారీ చేశారు. మర్రిపాలెం గిడ్డంగుల నుంచి అక్కడి హమాలీలు గంభీరం వచ్చి లోడింగ్, అన్‌లోడింగ్ చేసుకోవచ్చని న్యాయస్థానం నుంచి అనుమతి తెచ్చుకున్నారు. దీంతో గంభీరం హమాలీలు బుధవారం అడ్డుకున్నారు. దీనిపై పౌర సరఫరా విభాగం డీఎం ఐ.రాజేశ్వరి మర్రిపాలెం హమాలీలు న్యాయస్థానం నుంచి తీసుకువచ్చిన నోటీసును చూపించి లోడింగ్, అన్‌లోడింగ్ చర్యలను అడ్డుకోవద్దని గంభీరం హమాలీలకు తెలియచేశారు. అనంతరం ఆమె ఆనందపురం పోలీసులను ఆశ్రయించి లోడింగ్, అన్‌లోడింగ్‌లకు విఘాతం కలుగకుండా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా గంభీరం హమాలీల మేస్త్రి పోతురాజు మాట్లాడుతూ తమ పరిధిలోని గిడ్డంగుల వద్దకు ఇతర ప్రాంతాల నుంచి హమాలీలు వచ్చి పని చేయడం సరికాదన్నారు. అనంతరం సిటూ భీమిలి జోన్ కార్యదర్శి ఆర్.ఎస్.ఎన్.మూర్తి అక్కడికి చేరుకుని గంభీరంలో మర్రిపాలెం హమాలీలు లోడింగ్, అన్‌లోడింగ్ పనులు చేపట్టడం ఇరు ప్రాంతాల మధ్య చిచ్చు రేపడమేనన్నారు. ఇలాంటి సవరణలు ఏవైనా ఉంటే ముందుగా పౌర సరఫరా అధికారులు కార్మిక సంఘాలకు తెలియజేయాలన్నారు.

పర్యావరణ పరిరక్షణ.. ప్రజల బాధ్యత



పర్యావరణ దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పీసీబీ అధికారులు, గ్రీన్ క్లైమేట్ టీం ప్రతినిధులు

మర్రిపాలెం: భూగోళం మీద ఉన్న సమస్త జీవరాశులను, పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలదేనని విశాఖపట్నం డివిజన్ కాలుష్య నియంత్రణ మండలి జాయింట్ చీఫ్ ఇంజినీర్ కె.రమేష్ పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మాధవధారలోని సంస్థ కార్యాలయంలో ఆయన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఏపీ పీసీబీ, గ్రీన్‌క్లైమేట్ టీం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవం మన భూమి అంశంపై జరుగుతుందని తెలిపారు. భూమి పునరుద్ధరణ, ఎడారీకరణ, కరువును తట్టుకునే శక్తిపై దృష్టి సారించాలని ఐక రాజ్య సమితి పిలుపునిచ్చిందన్నారు. రీజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.వి.ముకుందరావు మాట్లాడుతూ విశాఖలో చిత్రలేఖనం వంటి పోటీలు జరుగుతాయని చెప్పారు. అనకాపల్లి, మన్యం జిల్లాల్లోనూ స్వచ్ఛంద సంస్థల సహకారంతో పర్యావరణ అవగాహన కార్యక్రమాలు తలపెట్టామన్నారు. అసిస్టెంట్ ఇంజినీర్ ఎ.ఎస్.ఆర్.సి.మూర్తి మాట్లాడుతూ, భావితరాలను దృష్టిలో ఉంచుకుని జీవన నాణ్యతను మెరుగుపరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో మండలి ఈఈ కరుణరేఖ , ఏఈ శ్రీలక్ష్మి, సైంటిఫిక్ ఆఫీసర్ సంయుక్త, రీసెర్చ్ అసోసియేట్ గౌతమి, సిఫా ట్రస్టు సీఈవో డాక్టర్ శశిప్రభ, గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం, వలంటీర్ రాజేశ్వరి, సిఫా ట్రస్టు సిబ్బంది, నర్సింగ్, హేమ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. అప్పన్న నిత్యకల్యాణం



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం నేత్రపర్వంగా జరిపించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేసి ఉదయం 9.30 నుంచి కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం అనంతరం సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలలో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.